# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం | 04 అక్టోబరు, 2026 | పేజీలు : 08


## చరిత్రకు సాక్ష్యంగా కోటగుళ్లు

### కాకతీయుల శిల్పకళకు అబ్బురపడిన గ్రూప్ 1, గ్రూప్ 2 అధికారులు



**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండల కేంద్రలోని కాకతీయుల చరిత్రకు సాక్ష్యంగా కోటగుళ్ల దేవాలయ సముదాయాలు నిలుస్తాయని శిక్షణ పొందుతున్న గ్రూప్ 1, గ్రూప్ 2 అధికారులు అన్నారు. గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ది చారిత్రక కట్టడం కాకతీయుల కళావైభవానికి ప్రతీకగా నిలిచిన శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లను హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శిక్షణ పొందుతున్న 180 మంది గ్రూప్1, గ్రూప్ 2 అధికారుల బృందం శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ చారిత్రక విశిష్ట తను తెలుసుకున్నారు. కాకతీయుల కాలం నాటి అద్భుత శిల్పకళ, ఆలయ

వివరాలు 2లో

## సమస్యల పరిష్కారం కోసం మంత్రికి విన్నపం

### మంత్రి వివేక్‌ని కలిసిన సర్పంచ్‌లు నాయకులు



**ప్రజాపక్షం/కొండపాక:** కొండపాక మండలంలోని పలు గ్రామాల సర్పంచులు నాయకులు మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ని సచివాలయంలో శనివారం పలు సమస్యల పరిష్కారం కోసం కలిసి విన్నవించారు. మం డలంలో పలు గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంచాల కనక రాములు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రణీత్ రెడ్డి ఏఎంసి వైస్ చైర్మన్ బట్ట పరశురాముడు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గజవెల్లి సుదర్శన్, తిమ్మారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కొయ్యడ వెంకటేశం గౌడ్ , రాంపల్లి సర్పంచ్ మల్లయ్య, జప్తి నాచారం సర్పంచ్ పావని శశిధర్ రెడ్డి, ఖమ్మంపల్లి సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి తోటకూర మల్లేశం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లక్ష్మణ్ కుమార్‌ను సన్మానించిన డిబిఎఫ్

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** తెలంగాణ రాష్ట్ర సాంఘిక శాఖ మాత్యులు లక్ష్మణ్ కుమార్‌ను హైదరాబాదులో డిబిఎఫ్ రాష్ట్ర నాయకులు ఘనంగా సన్మానించారు శనివారం రోజు హైదరాబాదులోని పరిశ్రమల భవన్ లో అభినందన కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సమస్యల్ని పరిష్కరించే దిశలో ప్రయత్నం చేస్తుందని ఇది దళిత పక్షపాత ప్రభుత్వమని ఆయన తెలిపారు. ప్రజా సంఘాలు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని, ఈ సందర్భంగా మంత్రి నాయకులను కోరారు. అభినందన కార్యక్రమంలో డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ తెలంగాణ రాష్ట్ర డి బిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రైతు రమేష్ కుమార్ సర్వయ్య ఆశ శ్రీరాములు మెట్ల శంకర్ గూడపు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.




## వరంగల్‌లో బుల్లి తెర తారల సందడి!



### 'ధర్మ'ను చూసేందుకు మహిళల క్యూ..'హౌస్ ఆఫ్ శివ' ఎగ్జిబిషన్‌కు అపూర్వ స్పందన

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** బుల్లితెరపై అభిమానాన్ని సంపాదించుకున్న నటీనటులు ఒక్కసారిగా తమ ముందుకు రావడంతో వరంగల్‌లో మహిళల సందడి నెలకొంది. శనివారం నగరంలోని పోర్ట్ రోడ్డులో నిర్వహించిన 'హౌస్ ఆఫ్ శివ' ఎగ్జిబిషన్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి మహిళలు భారీగా తరలివచ్చారు. 'మొగిలిరేకులు' సీరియల్‌లో ధర్మ పాత్రతో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న ఇంద్రనీల్ వర్మ తన సహధర్మచారిణితో పాటు పలువురు బుల్లితెర నటీనటులతో కలిసి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ రుచుల పచ్చళ్ల నుండి వన్‌గ్రామ్ గోల్డ్ అభరణాలు, చుడీదార్లు, పట్టుచీరలు తదితర విభిన్న ఉత్పత్తులను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. అయితే ఉత్పత్తుల కంటే తెరపై కనిపించే తమ అభిమాన నటీనటులను ప్రత్యక్షంగా చూసే అవకాశం మహిళలను మరింత ఆకట్టుకుంది. ఇంద్రనీల్ వర్మ, మేఘన, సిద్దార్థ వర్మ, విష్ణుప్రియ, శివనాగ్, మహేశ్వర్ తదితరులతో సెల్ఫీలు, ఫోటోలు దిగేందుకు అభిమానులు పోటీపడ్డారు. హైదరాబాద్ దాటి తొలిసారిగా వరంగల్‌లో అడుగుపెట్టిన తమకు మహిళల నుండి లభించిన స్పందన ఎంతో ఆనందాన్ని కలిగించిందని నిర్వాహకులు తెలిపారు. వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడం, లలితా పారాయణంలో పాల్గొనడం తమకు మరుపురాని అనుభూతినిచ్చిందని పేర్కొన్నారు. తెరపై అభిమానాన్ని చాటుకున్న ప్రేక్షకులు..ఈసారి తమ అభిమాన తారలను పక్కనే చూసి మురిసిపోయారు.

## శారదా ఉత్సవాలు.. ఎమ్మెల్యేకు ఆహ్వానం

### 11 నుండి 21 వరకు శృంగేరి సంప్రదాయ పద్దతుల్లో వేడుకలు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** శ్రీ శృంగేరి శ్రీ శారద శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను వరంగల్ పశ్చిమ ఎంఎల్‌ఏ రాజేందర్ రెడ్డి శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం వరంగల్ శ్రీ శృంగేరి శంకరమఠం ప్రధాన అర్చకులు సంగమేశ్వర జోషి వేదోక్త ఆశీర్వచనాలతో తొలి ఆహ్వాన పత్రికను ఎంఎల్ఏకు అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ వివరాలను తెలిపారు. ఈ నెల 11 నుండి 21 వరకు శారద శరన్నవరాత్రి ఉత్సవాలు శృంగేరి సంప్రదాయ పద్దతుల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు హోమాలు, విశేష పూజలు జరుగుతాయని తెలిపారు. శృంగేరి శంకరమఠం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఉండడం సంతోషకరమని ఎంఎల్‌ఏ నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శారదా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ శృంగేరి శంకర సేవా సమితి ప్రతినిధులు ఎం రాజేంద్రప్రసాద్, ఎస్ రామారావు, వై భాస్కర్, కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

### జంగిటి విద్యానాథ్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డిని బచ్చన్నపేట కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు జంగిటి విద్యానాథ్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యాత ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలరాజు, శ్రీనివాస్, సందీప్, హరీష్, ఆగయ్య, బాలరాజు, గణపతి, రమేష్, పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు గ్రాడ్యుయేట్లు తమ ఓటుతో సమాధానం చెప్పాలి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** అర్హత కలిగిన పట్టభద్రులు వెంటనే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని ఉస్మానియా విద్యార్థి జేఏసీ నేత ఇప్ప పృథ్వీరెడ్డి పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన 100 రోజులలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని నిరుద్యోగ యువత మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో జరుగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో బుద్ధి చెప్పాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నిరుద్యోగ యువత భవిష్యత్తుకు, పట్టభద్రుల ఆకాంక్షలకు సంబంధించిన ప్రజాతీర్పు అని, తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం పట్టభద్రులకు ఉందన్నారు. అర్హత కలిగిన పట్టభద్రులు చివరి తేదీ నవంబర్ 6లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జఫర్‌గడ్ మండల కేంద్రంలోని బాలాజీ ఇంటర్నెట్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షులు పల్లెపాటి జైపాల్‌రెడ్డి కేంద్రాన్ని ప్రారంభించి పట్టభద్రులు బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం సీఈవో తెలగాణ వెబ్‌సైట్ ద్వారా నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఫారం 18 ద్వారా దరఖాస్తులను తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ సభ్యులు శంకర్, నజీర్, రాజ్ కుమార్, సోమిరెడ్డి, రజనీకాంత్, ఉప సర్పంచ్ కుమార్, నాయకులు శ్రీధర్, రవి, రాజేశ్వర్‌రావు, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



**ప్రజాపక్షం/నల్లబెల్లి :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్ అన్నారు . శనివారం మండలంలోని నారక్కపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు మిడిదొడ్డి రాజ్‌కుమార్ ,బానోతు వీరన్నలు కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువాలు కప్పి స్వాగతించారు . ఈ సందర్భంగా వైనాల అశోక్ మాట్లాడుతూ నర్సంపేట ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి కార్యకర్తలకు అండగా ఉన్నారని ఎవరు ఆధైర్య పడొద్దని తెలిపారు . గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ఎంఎల్ఏ మాధవరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు . కాంగ్రేస్ పార్టీ కార్యకర్తలు ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేద వారందరి చేరేల కృషి చేయ్యాలన్నారు . ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు వడ్లూరి రమేష్ ,పార్టీ సీనియార్ నాయకులు తిప్పని చేరాలు ,కుంచాల రాజు ,శ్రీపతి కుమారస్వామి ,రాజిరెడ్డి ,మల్లయ్య ,మామిడి కృష్ణ ,కోడురు లింగమయ్య ,మ్మున్నిని రాజ్‌కుమార్ తదితరులు పాల్గోన్నారు .

## మోడల్ స్కూల్ హాస్టల్‌లో వైద్య శిబిరం

**ప్రజాపక్షం/ఖానాపురం:** జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు బుధరావుపేట తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి సిబిపి, థైరాయిడ్ ఫంక్షన్, రక్తహీనత, విటమిన్ బి12, విటమిన్ డి తదితర పరీక్షలకు రక్త నమూనాలు సేకరించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థినులకు అవసరమైన మందులు అందజేశారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ జ్యోతి సూచించారు. ఆకుకూరలు, కాయగూరలు, పప్పులు, గుడ్లు తదితరాలతో సమతుల ఆహారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం హాస్టల్‌లోని స్టోర్ రూమ్, వంటగది, భోజనశాల, విద్యార్థినుల గదులను



పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఏఎన్ఎంలు జ్యోతి, భార్గవి, హెల్త్ అసిస్టెంట్ గొడిశాల భాస్కర్, ఆశా కార్యకర్తలు భారతమ్మ, లలిత, కళాశాల ఇంగ్లీష్ లెక్చరర్ కాసుల రవికుమార్, వార్డెన్ లావణ్య, హాస్టల్ ఏఎన్ఎం శారద తదితరులు పాల్గొన్నారు.

## చదువుకున్న బడికి తిరిగి సేవ

**ప్రజాపక్షం/నెక్కొండ:** చదువు నేర్పిన పాఠశాలను మరిచిపోకుండా తాము చదువుకున్న బడికే తిరిగి సేవలందించాలన్న సంకల్పంతో నెక్కొండ జడ్పిహెచ్ఎస్ 1986...87 ఎస్ఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు చేపట్టిన కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది. పాఠశాలలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు అవసరమైన సామాగ్రిని అందించారు. పాఠశాల భద్రత కోసం సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకొచ్చారు. కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ చింతం ప్రవీణ్‌కుమార్ పాఠశాలకు బహుకరించిన మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. మహిళా విద్యకు బీజం వేసిన జ్యోతిరావుపూలే ఆలోచనలను కొనసాగించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.

**బడికి ఉపయోగపడేలా సేవలు:** 1986..87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాల విద్యార్థుల దుస్తుల మరమ్మతుల కోసం కుట్టు మిషన్‌తో పాటు అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.



**10 రోజుల్లో సిసి కెమెరాలు**

సెలవు రోజుల్లో కూడా పాఠశాల భద్రతపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి తెలిపారు. పాఠశాలలో సిసి కెమెరాల అవసరాన్ని ఆమె ప్రస్తావించగా, స్పందించిన 1986...87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 10 రోజుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి మానిటరింగ్‌ను నెక్కొండ పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ గ్రామ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మండల ఎంఈఓ రవీందర్, గటిక అజయ్‌కుమార్, సతీష్, సహజ కవి రాపాక శ్రీనివాస రవీంద్రనాథర్, పిఆర్‌టియూ ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఈదునూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/టేకుమట్ల:** టేకుమట్ల మండలంలోని రామకృష్ణాపూర్(టి) గ్రామానికి చెందిన పెద్దోజు రాజయ్య ఉపాధిహామీ పనికి వెళ్ళి సొమ్మసిల్లి పడిపోవడంతో హస్పటల్‌కు తరలించి చికిత్స చేయించుకొని ఇంటికి రాగా వారి ఇంటికి వెళ్ళి పరామర్శించినట్లు కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ తెలిపారు. అనంతరం



యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొలుగూరి అనిల్ తల్లి ఈశ్వరమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్, మండల ఉపాధ్యక్షుడు మాదం కొమురయ్య, సర్పంచ్‌లు గుణగంటి రజనీ మహేందర్, నాంపల్లి వీరేశం, పొన్నం సాంబయ్య, ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వీరవేన అజయ్, ఉప సర్పంచ్ కౌడగాని నవీన్, గట్టు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రూఫ్‌టాప్ సోలార్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/జనగామ:** ప్రభుత్వ సబ్సిడీ ద్వారా అం దించే రూఫ్‌టాప్ సోలార్‌ను సద్వినియోగం చేసుకోవాలని జనగామ మున్సిపల్ ఛైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ అన్నారు. శనివారం జనగామలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజనలో భాగం సేవా సేతు అభియాన్ అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఎన్‌పిడిసిఎల్ సూపరిండెంట్ సంపత్‌రెడ్డి అధ్యక్షత వహించగా ఛైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. రూఫ్ టాప్ సోలార్ వలన అనేక లాభాలు ఉన్నాయన్నారు. మన ఇంటి వద్ద మనే విద్యుత్ తయారు చేయవచ్చునని, తయారైన విద్యుత్‌ను మళ్లీ విద్యుత్ శాఖకు విక్రహించి లాభం పొందవచ్చునన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచాలనే ఉద్దేశ్యంతోనే భారత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు.



దీనికి ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇవ్వనుందని, ధరఖాస్తు విధానం, బ్యాంక్ రుణాలు, నెట్ మీటింగ్ తదితర అంశాలపై అవగాహన పొందాలన్నారు. బ్యాంక్, సోలాల్ ప్రతినిధులు పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఈ లక్ష్మి నర్సింహ్మారెడ్డి, ఎడి వేణుగోపాల్ పాటు మున్సిపల్ వైస్ ఛైర్మన్ బూష పర్వతాలు, కౌన్సిలర్లు నాని, బూడద జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రకు సాక్ష్యంగా కోటగుళ్లు

మొదటి పేజీ తరువాయి

నిర్మాణ శైలి, రాతి శిల్పాల సౌందర్యాన్ని చూసి అబ్బురపడ్డారు. ఇంతటి అపురూపమైన చారిత్రక సంపదను చూసే అవకాశం కలగడం ఆనందంగా ఉందని, కోటగుళ్ల శిల్పసంపద అద్భుతమని కొనియాడారు. ఆలయ చారిత్రక విశిష్టతను సీనియర్ జర్నలిస్టు తాళ్లపలిల యాదగిరి గౌడ్ అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పర్యాటక శాఖ నుండి సూర్యకిరణ్, తాళ్లపల్లి యుగంధర్ గౌడ్, పురావస్తు శాఖ సెక్యూరిటీ నల్లగొండ రాజు గౌడ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## ఆర్‌టిసి డిపోలో ఎన్నికల ప్రచారం

**ప్రజాపక్షం/నర్సంపేట:** నర్సంపేట పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయూ, టిఎంయూ, ఈయు సంఘాల జేఏసీ కి



మద్దతు ఇవ్వాలని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు నర్సంపేట మున్సిపాలిటి మాజీ ఫ్లోర్ లీడర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల సాంబయ్య గౌడ్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి పిఎన్ రావు తో పాటు కార్మికు సంఘాల నాయకులతో కలిసి కాగడ, బస్ గుర్తులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి డిపో మిత్రపక్షాల నాయకులు యాదయ్య, బాబు, శ్రీలత, శంకరయ్య, ఎండి పాషా, మహిళా ఉద్యోగులు, నర్సంపేట విద్యార్థి సంఘం అధ్యక్షులు కటారి ఉత్తమ్ కుమార్ పాల్గొన్నారు.

## ఎన్‌సిసి మాస్ స్వచ్ఛతా కార్యక్రమం

**ప్రజాపక్షం/నర్సంపేట:** నర్సంపేట పట్టణంలోని 10వ బెటాలియన్ ఎన్‌సిసి వరంగల్ వారి ఆదేశాల మేరకు విజ్‌డమ్ హైస్కూల్‌లో ఎన్‌సిసి మాస్ స్వచ్ఛత క్యాంపెనింగ్ ఏక్




ఘంటా, ఏక్ సాత్‌జ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్‌సిసి క్యాడెట్లు పాఠశాల పరిసరాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టి, పరిశుభ్రత, ఆరోగ్యం, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిఈటి , ఎన్‌సిసి ఏఎన్ఓ ప్రశాంత్ కుమార్ , పిఈటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు

**ప్రజాపక్షం/టేకుమట్ల:** ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు, ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని రాఘవరెడ్డి పేట గ్రామ సర్పంచ్ వంగ మమత శ్రీధర్ గౌడ్ అన్నారు. శనివారం వారం మండలంలోని రాఘవరెడ్డి పేట గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు ఉందని, పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్య ప్రమాణాలతో బోధన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోసిక పద్మ, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు, పాల్గొన్నారు.

## రూఫ్ టాప్ సోలార్‌తో విద్యుత్ పొదుపు సాధ్యం

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జనగామ మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనలో భాగంగా సేవా సేతు అభియాన్ అవగాహన సదస్సు నిర్వహించారు. సూపరిండెంట్ ఇంజనీర్ సంపత్ రెడ్డి అద్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ హాజరవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వ్యవస్థ ప్రయోజనాలు, ప్రభుత్వం అందించే సబ్సిడీ, దరఖాస్తు విధానం, బ్యాంకు రుణాలు, నెట్ మీటరింగ్, తదితర అంశాలపై బ్యాంకు అధికారులు, సోలార్ ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, విద్యుత్, బ్యాంక్ అధికారులు, సోలార్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ప్రజాపక్షం/పరకాల : పరకాల అంగన్వాడి ప్రాజెక్టులోని పరకాల సెక్టర్ లో గల శ్రీనివాస కాలనీ అంగన్వాడి కేంద్రంలో 9వ రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా కార్యక్రమం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎం రోజా రాణి మాట్లాడుతూ ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రంలో అందించే పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పౌష్టిక ఆహారంతోనే తల్లి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. సులభంగా లభించే పండ్లు ఆకుకూరలు కూరగాయలను ఆహారంతో భాగంగా తీసుకోవాలని తెలిపారు. 03 సంవత్సరాల వయస్సు గల పిల్లలను నమోదు చేయడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ కే రమా ఆయా భద్రమ్మ గర్భిణీలు బాలింతలు పిల్లలు హాజరైనారు.

# రోహిత్ వేముల చట్టానికై ఐక్యంగా పోరాడుదాం

ప్రజాపక్షం/కేయూ క్యాంపస్: యూనివర్సిటీలలో, కాలేజీలలో పీడిత కులాల నుండి వచ్చిన విద్యార్థులపై కులవివక్ష చూపడం వలన డ్రాప్ అవుట్లు, ఆత్మహత్యలు పెరుగుతున్నాయని వీటి నివారణకు రోహిత్ వేముల చట్టం కోసం ఐక్యంగా పోరాడు దామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం కాకతీయ యూనివర్సిటీలోని జాఫర్ నిజాం హాల్లో అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేయూ కన్వీనర్ దండు నవకిరణ్ అధ్యక్షతన "రోహిత్ వేముల యాక్ట్" పై వివిధ విద్యార్థి సంఘాల, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్, విద్యా పరిరక్షణ కమిటీ కార్యదర్శి ప్రొఫెసర్ కె లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ రెండు వేల సంవత్సరాలకు పైగా విద్యకు దూరం చేయబడ్డ అణగారిన వర్గాలు యూనివర్సిటీ విద్యలోకి, కాలేజీ విద్యలోకి ప్రవేశించడమే ఒక మహత్తర పోరాటమని ఆయన అన్నారు. స్కాలర్షిప్ లు, ఫెలోషిప్పులు తగ్గించడం లేదా ఆలస్యంగా ఇవ్వడం, రియంబర్స్మెంట్ ఉన్నా వీరి దగ్గర నుండి బలవంతంగా ఫీజులు వసూలు చేయడం లాంటి కొత్త రూపాలలో కులవివక్ష రాజ్యమేలుతుందని ఆయన వివరించారు. ఈ సమావేశంలో దూడపాక శ్రీకృష్ణ, నరేష్, శ్రవణ్, అన్నమయ్య, సాయికుమార్, రాంబాబు, భారత్, రాజేష్, పాల్గొన్నారు.

# ప్రజావాణి వేదిక మార్పు

ప్రజాపక్షం/వేలేరు : వేలేరు మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించే వేదికను మారుస్తున్నట్లు ఎంపిడిఒ కిషన్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈసందర్భంగా కిషన్‌నాయక్ మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ఈమార్పు చేసినట్లు పేర్కొన్నారు.ఇప్పటి వరకు వేలేరు మండలకేంద్రంలోని రైతువేదికలోనిర్వహిస్తున్న మండలస్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ఇకపై అక్టోబర్ 5,2026 సోమవారం నుంచి ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి1గంట వరకు ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. మండలంలోని ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించదలచిన అర్జీదారులు కొత్త వేదికను గమనించి, నిర్దేశిత సమయానికి ఎంపిడిఒ కార్యాలయానికి హాజరై తమసమస్యలను తెలియజేయాలని కిషన్‌నాయక్ సూచించారు. ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా అందించేందుకు ఈమార్పు చేసినట్లు తెలిపారు.

# మహిళల భద్రతే షీ టీమ్ లక్ష్యం



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్: నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో అందరు భాగస్వామ్యం కావాలని తమవంతు బాధ్యతలను నిర్వర్తించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల మహిళల మీద జరిగే నేరాలను అదుపు చేయవచ్చని హన్మకొండ సబ్ ఇన్ స్పెక్టర్ స్వాతి అన్నారు. హన్మకొండ నయింనగర్ లోని ఎంజీఎమ్ గర్ల్స్ హాస్టల్ విద్యార్థులతో సైబర్ నేరాలు, మహిళలపై జరిగే అత్యాచారాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ సందర్భంగా హన్మకొండ షీ టీం సబ్ ఇన్ స్పెక్టర్ స్వాతి మాట్లాడుతూ అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్, స్నాప్ చాట్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై, అవగహన కలిగివుండాలని, మహిళలు ఒంటరిగా తెలియని ప్రదేశాలకు ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు అందరు టీసేఫ్ యాప్ ను ఉపయోగించుకోవాలని, టీసేఫ్ యాప్ పై అవగాహన కలిగి ఉండాలని, ఉద్యోగాలు చేసే మహిళలకు తాము పనిచేసే ప్రదేశాలలో అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల, ఆకతాయిల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వారితో తమ వ్యక్తిగత విషయాలు పంచుకోరాదని సూచించారు. ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా వెంటనే షీ టీమ్ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930 కి ఫిర్యాదు చేయాలని, మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270కు ఫిర్యాదు చేసిన వారి వివరాలను చాలా గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ, కానిస్టేబుల్ పూర్ణ, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ టివి ఛానల్ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా

ప్రజాపక్షం/హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులుకేఆర్ నాగరాజు మీద ఎన్ టివి ఛానల్ లో ప్రసారం చేసిన తప్పుడు వార్తను 65వ డివిజన్ అధ్యక్షులు నేదునూరి సునీల్ తీవ్రంగా ఖండించారు. ఒక దళిత నాయకుడు ఐపీఎస్ రిటైర్మెంట్ తర్వాత ప్రజాసేవ చేయాలని దృఢ సంకల్పంతో ఎమ్మెల్యేగా పోటీ చేసి ప్రజల ఆశీర్వాదంతో గెలిచి వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి పథం వైపు నడిపిస్తూ ప్రజాదరణ పొందుతున్న ఎమ్మెల్యే నాగరాజు పై తప్పుడు ప్రసారం చేయడం సిగ్గుచేటని నేను దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని, ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజ్ రాజకీయంగా ఎదుగుదల చూసి ఓర్చుకోలేక కొన్ని ఛానళ్లు ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయనీ ఎలాంటిఆధారాలులేకుండా, వాస్తవాలను నిర్ధారించకుండా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వ్యక్తిత్వాన్ని, ప్రతిష్టను దెబ్బతీసే విధంగా తప్పుడు ప్రచారం చేయడం పూర్తిగా బాధ్యతారాహిత్యమైనచర్య అన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా ముందుకు నడిపిస్తున్న ఎమ్మెల్యే పై ఇలాంటి కుట్రపూరిత వార్తలు ప్రజలు నమ్మరని ఎన్ టివి యాజమాన్యం వెంటనే తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకొని, బహిరంగ క్షమాపణ చెప్పాలని 65 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుడిమాండ్ చేశారు.

# దళిత మహిళా విఓఎపై దాడికి ఖండన

## నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/నెక్కొండ: విధుల్లో ఉన్న దళిత మహిళా విఓఏపై దాడి చేయడం అమానుషమని ఎంఆర్‌పిఎస్(టిఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య అన్నారు. శనివారం నెక్కొండ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పికె మల్లెపల్లి గ్రామంలో విఓఏగా పనిచేస్తున్న గనిపల్లి మాధవిపై అదే గ్రామ మాజీ సర్పంచ్ భర్త కొప్పోలు అమర్‌నాథ్ అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడినట్లు ఆరోపించారు. గ్రామ పంచాయతీ సమక్షంలో మహిళా ఉద్యోగిపై దాడి చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. కులపరమైన దూషణలకు పాల్పడుతూ దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నందున ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విఓఏగా విధులు నిర్వహిస్తున్న మహిళకు ఆటంకం కలిగించినందుకు సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఈదునూరి యాకయ్య ప్రభుత్వాన్ని కోరారు.

# చేయి చేయి కలుపుదాం.. స్వచ్ఛ కమలాపూర్ సాధిద్దాం



ప్రజాపక్షం/కమలాపూర్: కమలాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలకమండలి ఆధ్వర్యంలో చేపట్టిన ఊరు కోసం ఒక్కరోజు శ్రమదానం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరం చేయి చేయి కలిపి స్వచ్ఛ కమలాపూర్ గ్రామంగా తీర్చిదిద్దుదామని కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్ అన్నారు. కమలాపూర్ ఎస్సీ కాలనీలోని 14వ వార్డులో గ్రామ సర్పంచ్ సతీష్, పాలకమండలి ఆధ్వర్యంలో ఊరు కోసం ఒక్కరోజు శ్రమదానం చేపట్టిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తవుటం ఝాన్సీ రాణి రవీందర్ హాజరై వారితో సైడ్ కాలువలను, రోడ్లను పరిశుభ్రం చేశారు. మన ఊరి పరిశుభ్రత మన అందరి బాధ్యత అని అన్నారు. మన ఒంటిని మన ఇంటిని శుభ్రపరుచుకున్నట్లే మన గ్రామాన్ని స్వచ్ఛందంగా అందరూ ముందుకు వచ్చి రోడ్ల పైన ఉన్న చెత్తను, పేరుకుపోయిన సైడ్ కాలువలను శుభ్రం చేయాలని అన్నారు. పరిశుభ్రతతోనే దోమల వల్ల వచ్చే మలేరియా, బోధకాలు వంటి జబ్బులను నియంత్రించవచ్చని అన్నారు. ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మాట్ల రమేష్, జేపిసి చైర్మన్ మౌటం సంపత్, వార్డు మెంబర్లు జన్ను బిక్షపతి, పుల్ల ఐలయ్య, పుల్ల శ్రీనివాస్, మార్క అశోక్, మాట్ల రాజవీరు, తిరుపతి, రాజయ్య, గంధసిరి బిక్షపతి పాల్గొన్నారు.

# గంజాయి సేవిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు

ప్రజాపక్షం/చిట్యాల: మండలంలోని జూకల్ శివారులో గంజాయి సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం జూకల్ శివారులోని కాలువ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో కొందరు గంజాయి సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్నట్లు ఎస్ఐ 2 పి ఓంపాల్‌కు సమాచారం అందింది. దీనితో సిబ్బందితో కలిసి ఉదయం 10గంటల ప్రాంతంలో అక్కడిక చేరుకోగా పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన ఐదుగురిని వెంబడించి పట్టుకున్నారు. వారిని చల్లగరిగ గ్రామానికి చెందిన మ్యాదరి ప్రశాంత్(24), దూడపక ప్రకాష్(21), బైస బన్నీ(23), కుంచం బన్నీ(22), ముచినిపర్తికి చెందిన పసరగొండ సంజయ్‌రాజ్(19)గా గుర్తించారు. వైద్య పరీక్షల్లో గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

# ఘనంగా బొడ్డెమ్మ ప్రారంభం



ప్రజాపక్షం/పాలకుర్తి: మండల కేంద్రంలోని విస్నూర్ రోడ్డులో శ్రీవరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బొడ్డెమ్మ వేడుకలను మహిళలు, బాలికలు ఘనంగా నిర్వహించారు. బొడ్డెమ్మను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బొడ్డెమ్మ చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ కోలాటాలు ఆడారు. కుటుంబ సౌభాగ్యం, శాంతి, సంతోషం కోసం ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో నంగునూరి పద్మ, భూలక్ష్మి, నీలిమ, ఉమ, ఎలేంద్ర, ప్రియాంక, ఝాన్సి, విజయ, ధనలక్ష్మి, లలిత, స్వాతి, స్వరూప, మమత, కోమలత, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేపై తప్పుడు వార్తలు రాసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పై తప్పుడు వార్తలు ప్రచురించిన ప్రముఖ మీడియా ఛానల్ పై చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పై చేసిన తప్పుడు ఆరోపణలను నిరసిస్తూ హన్మకొండ అంబేద్కర్ విగ్రహ సర్కిల్ లో వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అనంతరం కొంకా హరిబాబు మాట్లాడుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి ఎలాంటి అవినీతి మరకలు అంటకుండా నీతి నిజాయితీతో పేద బడుగు బలహీన వర్గాలకు సేవ చేస్తుండడాన్ని జీర్ణించుకోలేని కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ అధ్యక్షుడు చిర్ర రాము గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం శివరాం ప్రసాద్, 55వ డివిజన్ అధ్యక్షుడు గడ్డం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం



ప్రజాపక్షం/నడికూడ : నడికూడ మండలం చర్లపల్లి గ్రామంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్ ముదిరాజ్ పాల్గొని మాట్లాడుతూ గర్భిణీలు,బాలింతలు,పిల్లలు ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని స్థానికంగా దొరికే పండ్లు ఆకుకూరలు,కూరగాయలు చిరుధాన్యాలు ఆరోగ్యకరమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. పోషణ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు,ఆయాలు,ఆశా కార్యకర్తలు,గర్భిణీలు, బాలింతలు,చిన్నారులు తల్లిదండ్రులు ఇతరులు పాల్గొన్నారు.

# 9న మెగా జాబ్‌మేళా

నిరుద్యోగ యువతను పెద్ద సంఖ్యలో నమోదు చేయాలి

ప్రజాపక్షం/చిట్యాల:భూపాలపల్లి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అక్టోబర్ 9న భూపాలపల్లిలోని పుష్ప గ్రాండ్‌లో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు అర్హులైన యువతను పెద్ద సంఖ్యలో నమోదు చేయించాలని అధికారులు సూచించారు. ఈ మేరకు చిట్యాల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దారు వసంతరావు, ఎస్‌హెచ్ఓ సతీష్, ఏపిఎం కోటేశ్వరరావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటింటికి వెళ్ళి నిరుద్యోగ యువత వివరాలను సేకరించి, అర్హులను జాబ్‌మేళాకు నమోదు చేయించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వివోఏలు, స్వయం సహాయక సంఘాల సభ్యుల సహకారంతో అర్హులైన ప్రతి యువతీ యువకుడిని ఈ అవకాశానికి అనుసంధానం చేయాలని సూచించారు. నమోదు చేసిన అభ్యర్థుల వివరాలను గ్రామాల వారీగా నమోదు చేసి ప్రతి రోజూ నివేదికలు సమర్పించాలని ఎంపిడిఓ కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు, వీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# పోషక ఆహారమే తీసుకోవాలి



తహసీల్దారు తూకుంట్ల వసంతరావు

ప్రజాపక్షం/చిట్యాల:మహిళలు అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందించే పూర్తి స్థాయి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని భుజించాలని చిట్యాల తహసీల్దార్ తూకుంట్ల వసంతరావు కోరారు. శనివారం మండలంలోని తిరుమలాపురం గ్రామంలో ఐసిడిఎస్ మండల సూపర్‌వైజర్‌లు అప్సర సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పోషణ మాసోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో ఆటపాట విద్యలు నేర్పడంతో పాటు పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలకు బలవర్ధకమైన ఆహారాన్ని, చిక్కి ప్యాకెట్లను అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు గ్రామాలలో ఉన్న మహిళలు తమ పిల్లలకు పుష్టికరమైన ఆహారాన్ని అందించే విధంగా అవగాహన కల్పించాలని వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ జబ్బులకు దూరంగా ఉండేలా వారిని ప్రోత్సహించాలని కోరారు. అనంతరం ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ లింగంపల్లి రాకేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు మాట్లాడుతూ పోషణ మాసోత్సవ ప్రత్యేకతను వెయ్యి రోజుల ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు గ్రామాలలో సీజనల్ వ్యాధుల పట్ల తృణధాన్యాలు, ఆకుకూరలు, తదితర పోషక విలువలు కలిగిన ఆహారం పట్ల అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అంగన్‌వాడీ టీచర్లు, ఏఏన్ఎం, ఆశా వర్కర్, ఆయాలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

# 22..ఏ పేరుతో పేదల భూములు లాక్కోవద్దు

మేడారం అభివృద్ధికి రూ.300 కోట్లు ఏమయ్యాయి? బడే నాగజ్యోతి



ప్రజాపక్షం/ములుగు:22..ఏ జాబితా పేరుతో పేదలు, రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములపై అనిశ్చితి నెలకొనకుండా ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని బిఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జడ్పి చైర్మన్ బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. తాడ్వాయిలో బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు దండుగుల మల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. మేడారం అభివృద్ధికి రూ.300 కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతున్నారని, ఆ అభివృద్ధి క్షేత్రస్థాయిలో ఎక్కడ కనిపిస్తోందో మంత్రి సీతక్క సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మేడారంలో భక్తులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. తాడ్వాయి మండలంలోని రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో అవసరమైనంత ఎరువును అందుబాటులో ఉంచాలని కోరారు. రానున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో బిఆర్ఎస్ అభ్యర్థి కోసం ప్రతి కార్యకర్త పట్టభద్రులను కలిసి పార్టీ విధానాలను వివరించాలని పిలుపునిచ్చారు. 22...ఏ భూములు, మేడారం అభివృద్ధి, యూరియా, స్థానిక సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో దండుగుల మల్లయ్య, సుష్మిట్ రమేష్, దుర్గం రమణయ్య, కాక లింగయ్య, రేగ నర్సయ్య, రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, కుడుముల లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రాయినిగూడెం పిహెచ్‌సికి 24గంటల సేవలు అందించాలి

వైద్యులు, సిబ్బంది, మందుల కొరత తీర్చాలి: బిజెపి



ప్రజాపక్షం/ములుగు:రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24గంటల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. బిజెపి మండలాధ్యక్షుడు రాయంచు నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు పిహెచ్‌సిని సందర్శించి వైద్య సేవలు, సిబ్బంది అందుబాటు, మందుల లభ్యతపై పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు, మండల అధ్యక్షుడు నాగరాజులు మాట్లాడుతూ చుట్టుప్రక్కల గిరిజన గ్రామాలకు పిహెచ్‌సి ప్రధాన వైద్య కేంద్రంగా ఉన్నప్పటికీ పూర్తి స్థాయి సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వైద్యులు రోస్టర్ విధానంలో విధులు నిర్వహించడం, మందుల కొరత, సిబ్బంది పరిమిత సమయానికి అందుబాటులో ఉండడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. పర్మినెంట్ వైద్యుడు, నర్సింగ్, ఇతర సిబ్బందిని నియమించి 24గంటల వైద్య సేవలు అందించాలని, ఫార్మసిస్ట్‌ను నియమించి అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి లకావత్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు లింగంపల్లి రవీందర్‌రావు, కార్యదర్శి గుండవైన శ్రీహరిగౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు జితేందర్‌రావు, యువ మోర్చా అధ్యక్షుడు రాయపురం అనిల్, నాయకులు కట్టయ్య, మమన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్

ప్రజాపక్షం/భూపాలపల్లి:పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ అన్నారు. 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా భూపాలపల్లి మండల స్థాయి పోషణ మాసం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమాధికారి జి మల్లేశ్వరితో కలిసి మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మన అంగన్వాడీ మన బాధ్యత అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లులు, పిల్లల్లో రక్తహీనత నివారణ, పిల్లలు తక్కువ బరువుతో పుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్వాడీ టీచర్లు, సూపర్ వైజర్లు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. 05 సంవత్సరాల పిల్లల బరువు, ఎత్తును ప్రతి నెలా పరిశీలించి పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి బాలామృతం ప్లస్ అందించడం పట్ల వైస్ చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా సంక్షేమాధికారి జి మల్లేశ్వరి మాట్లాడుతూ గర్భస్థ శిశువు దశ నుంచి బిడ్డకు రెండు సంవత్సరాల వయస్సు వరకు ఉన్న మొదటి వెయ్యి రోజుల ప్రాముఖ్యతపై ప్రతి తల్లికి అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు వైవిధ్యమైన ఆహారం, కాలానుగుణంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు అందించాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఆరు నెలల చిన్నారులకు అన్నప్రాసనలు, మూడు సంవత్సరాల పిల్లలకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వి.అరుణ, కె.రజిత, పి.లక్ష్మీ, రాజేశ్వరి, ఐదు సెక్టర్లకు అంగన్వాడీ టీచర్లు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం

కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/మంగపేట:తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశానుసారం జిల్లా పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ పటేల్ సూచన మేరకు శనివారం మండలంలోని తిమ్మంపేట గ్రామంలో అంబేద్కర్ సంఘం జిల్లా కో కన్వీనర్ మోదుగు బాబు భార్య మోదుగు శ్రీలత మృతి చెందిన విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులతో కలిసి వారి నివాసానికి స్వయంగా వెళ్లి శ్రీలత చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మీ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, తెలంగాణ రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క సహాయంతో దశదిన ఖర్మలకు ఒక బియ్యం బ్యాగ్ ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దుర్గం నరసింహారావు, దుర్గం వెంకటేశ్వర్లు తండ్రి దుర్గం చిన్నమల్లయ్య, ఇటీవల కాలంలో మృతి చెందారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు చిన్నపెల్లి రాంబాబు, పూజారి సురేందర్, పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, జిల్లా యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మైప లాలయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారీకారి హరికృష్ణ, ఐఎన్టియుసి మండల అధ్యక్షులు పుల్లూరి తిరుపతి, బోడ బొర్రయ్య, మండల నాయకులు శానం సత్యనారాయణ, ఆక సతీష్, బొంబోతుల మురళి, జంగం భానుచందర్, అర్జున్, చిన్నపెల్లి నరసింహారావు పాల్గొన్నారు.

# మేడారంలో నేడు సర్పంచ్‌ల చైతన్య సదస్సు

ప్రజాపక్షం/ములుగు:ములుగు జిల్లా సర్పంచ్‌ల చైతన్య సదస్సును ఆదివారం మేడారంలోని సమ్మక్క సారలమ్మ వద్ద నిర్వహించనున్నట్లు జిల్లా సర్పంచ్‌ల సంఘం కన్వీనర్ ముష్పెపల్లి కుమార్ గౌడ్ తెలిపారు. ఉదయం 10.30గంటలకు జరిగే సదస్సుకు ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సర్పంచ్‌లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సర్పంచ్‌ల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం పార్టీలకు అతీతంగా ఐక్యంగా, సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సుకు తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు చింపు సత్యనారాయణ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు అశోక్‌రావు, రాష్ట్ర కార్యదర్శి సంపత్‌నాయక్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరుకానున్నట్లు తెలిపారు. సర్పంచ్‌ల హక్కులు, సమస్యలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న సదస్సుకు రెండు జిల్లాల సర్పంచ్‌లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు.

# మేడారంలో ఇందిరమ్మ ఇళ్ళ పరిశీలన

ప్రజాపక్షం/తాడ్వాయి: రాష్ట్ర గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.ఈ గౌతమ్ శనివారం కుటుంబ సమేతంగా మేడారం శ్రీ సమ్మక్కసారలమ్మ అమ్మవార్లని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద సర్పంచ్ పీరీల భారతివెంకన్న, పూజారులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్,ఎంపీడీవోతో కలిసి మేడారంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ళను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తామని, నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ భార్గవి, పీఆర్ ఏఈ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వమ ధ్యేయం: సర్పంచ్

ప్రజాపక్షం/తాడ్వాయి : గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని లింగాల సర్పంచ్ మొగిలి పల్లి రవీందర్ పేర్కొన్నారు. లింగాల గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను శనివారం ఆయన స్థానిక నాయకులు, గ్రామస్తులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో అంతర్గత రహదారుల సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర మంత్రి సీతక్క పది సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేశారని లింగాల గ్రామానికి ఏడు, కోడిశాల గ్రామానికి మూడు కేటాయించినట్లు వివరించారు.నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు చన్నూరి సతీష్, మాజీ సర్పంచ్ ఊకె మౌనికనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల అఖండ హరినామ సంకీర్తనలో కంచనపల్లి బృందం

ప్రజాపక్షం/రఘునాథపల్లి:ఈ నెల 6న తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వ హించే అఖండ హరినామ సంకీర్తనలో మండలంలోని కంచనపల్లి గ్రామంలో గల శ్రీరామదాసు భజన మండలికి దక్కింది. గ్రామంలోని శ్రీ భక్తాంజనేయ దేవస్థానం గురువులు శ్రీశ్రీ నాగుల నాగేశ్వరరావు స్వామి మార్గదర్శకత్వంలో శ్రీ రామ దాసు భజన మండలి అధ్య క్షుడు కొలిపాక శ్రీనివాస్ స్వామి ఆధ్వర్యంలో తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో హరినామ సంకీర్తన కార్యక్రమం లో ఆధ్యాత్మిక ప్రదర్శన ఉంటుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ దేవతల ఆశీస్సులు, శ్రీ వేంకటే శ్వర స్వామి వారి కృప కటాక్షా లు, ఆశీస్సులు మెండుగా ఉండాలని భజన బృందం సభ్యులు ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ఐదు వేలు తిమ్మాపేట గ్రామంలో తిరుమలలో తమకు ప్రదర్శన నిర్వహించే ఇంత గొప్ప అవకాశం కల్పించిన హన్మకొండ ప్రోగామ్ అసిస్టెంట్ కృష్ణమూర్తి స్వామికి శ్రీరామ దాసు భజన మండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపా రు.ఈ కార్యక్రమంలో భజన బృందం సభ్యులు జి.కరుణా కర్, కే.మహేందర్, బి.రాఘవేంద్రచారి,బి.ఉపేంద్రా చారి,పి. బిక్షపతి, జి.శ్రీను, హెచ్.శ్రీనివాస్, కే.మిట్టుజీ, టి.సందీప్, డి.చంద్రశేఖర్, వై.రమేష్, కే.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా కొప్పులశేషారెడ్డి



**ప్రజాపక్షం/ అల్లాదుర్గం :** 2014 , నుండి అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న కొప్పుల శేషా రెడ్డి మరోసారి నూతన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి మరోసారి అధ్యక్షుడిగా నియమించిన రాష్ట వైద్య ఆరోగ్య అండ్ సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా గారికి మండల పార్టీ నాయకులకు కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తా అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలతో మరింత సేవ చేస్తానని మనస్ఫూర్తిగా తెలిపారు.

## దేవుని చెరువు శిఖంలో 2ఎకరాలు కబ్జా

**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండలంలోని సికింద్లాపూర్ గ్రామంలోని సర్వేనంబర్ 148లో ఉన్న 23.25 ఎకరాల దేవుని చెరువు శిఖం భూమిలో సుమారు రెండు ఎకరాలు గ్రామానికి చెందిన చేగూరి ఆంజనేయులు కబ్జా చేశాడని గ్రామస్థులు నర్సాపూర్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. భూమి ఆక్రమించి బోరు కూడా వేశాడని, దీంతో చెరువులో నీటి నిల్వలు కూడా తగ్గి కొరత ఏర్పడుతుందన్నారు. అధికారులు స్పందించి ఆక్రమించిన చెరువుశిఖం భూమిని స్వాదీనం చేసుకొని పరిరక్షించాలని గ్రామస్థులు కోరారు.

## కళ్యాణ లక్ష్మి పథకానికి 12 ఏళ్లు

**ప్రజాపక్షం /పటాన్‌చెరు :** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంబించిన కళ్యాన లక్ష్మి పథకానికి 12 ఏళ్లుపూర్తియిన సందర్బంగా పటాన్‌చెరులో మాజీ కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ,బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పటాన్‌చెరు అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్ని బీఆర్ఎస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇన్‌చార్జీ వెన్నవరం ఆదర్శ్ రెడ్డితో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 2014 అక్టోబర్ 2న ప్రారంభమైన కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల విహాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది. ప్రారంభంలో రూ. 51 వేలు ఉన్న సహాయాన్ని 2017లో 75,116కు 2018లో రూ. 1,00,116 కు పెంచడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సందర్బంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కళ్యాన లక్ష్మి పథకం కింద అందుతున్న రూ. 1,00,116 కు అదనంగా ఒక తులం బంగారం ఇస్తామని హామి ఇచ్చిందని అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటికే అమల్లో ఉన్న కళ్యాణ లక్ష్మి ఆర్థిక సహాయాన్ని కూడా సక్రమంగా కొనసాగించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్తు సరఫరా రాకపోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ మండలంలో పర్యటనలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు గారు కాగజ్ మద్దూర్ గ్రామంలో దయనీయమైన దృశ్యాన్ని చూసి చలించిపోయారు. స్థానిక నాయకురాలు సునీతా లక్ష్మారెడ్డి గారితో కలిసి వెళ్తుండగా మార్గం మధ్యలో కరెంటు లేక ఎండిపోతున్న వరి పొలాలను చూసి పొలంలోకి వెళ్లి అక్కడున్న మహిళా రైతు నాగమణితో మాట్లాడి ఆమె కష్టాలను అడిగి తెలుసుకున్నారు. చిట్టోళ్ల నాగమణి అనే ఆ మహిళా రైతు హరీశ్ రావు గారి ముందు తన ఆవేదనను వెళ్లగక్కింది. బోర్లలో నీళ్లున్నా.. ప్రభుత్వ చేతకానితనం వల్ల కరెంటు రాక పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని వాపోయింది. సుమారు 60 వేల రూపాయల పెట్టుబడి పెట్టి మూడు ఎకరాల్లో వరి నాట్లు వేస్తే.. అందులో సగం పొలం పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో పగటిపూట నిరంతరాయంగా కరెంటు వచ్చేదని, ఎలాంటి రంది లేకుండా పంటలు పండించుకున్నామని నాగమ్మ గుర్తుచేసుకుంది. కానీ ఇప్పుడు కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందని వాపోయింది. ఉదయం 5 గంటలకు రావాల్సిన కరెంటు 8 గంటలకు వస్తోందని, ఆ వచ్చిన కరెంటు కూడా నిలకడగా ఉండకుండా మధ్యాహ్నం మళ్లీ కోతలకు గురవుతోందని వివరించింది. కేవలం కరెంటు కోతలే కాకుండా లో వోల్టేజ్ కారణంగా పదే పదే ఫ్యూజులు ఎగిరిపోతున్నాయని, రిపేర్ కోసం ఒక్కోసారి నాలుగు రోజుల పాటు కరెంటు లేక పొలాలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేసింది. కరెంటు వచ్చిపోవడం వల్ల పారిన మడే పారుతోందని, కింది మడులకు నీళ్లు అందడం లేదని తెలిపింది. నాగమ్మ ఒక్కరిదే కాదు, ఆ ప్రాంతంలోని రైతులందరి పరిస్థితి ఇలాగే కరెంటు లేక కాలిపోతోందని తెలుసుకున్న హరీశ్ రావు గారు రైతుల పరిస్థితి చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ భూమిలో ధాన్యం పోసుకోవడం కోసం అనుమతి ఇవ్వాలి



**ప్రజాపక్షం/కొండపాక :** మండల కేంద్రమైన కొండపాకలో 733 సర్వే నంబర్లు రెండు ఎకరాల 18 గుంటల ప్రభుత్వ భూమి ఉందని అందులో చెట్లు పొదలు ఉండడం పరిసర ప్రాంత రైతులకు ఇబ్బందులు గురవుతున్నాయని వాటిని తొలగించడం కోసం అనుమతి ఇవ్వాలని అలాగే రైతులు ధాన్యం ఆరపోసుకోవడం కోసం కూడా ఇవ్వాలని కొండపాక గ్రామ సర్పంచ్ మంచాల నవీన శ్రీనివాస్ తహసిల్దార్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఆ భూమిలో ఉన్న చెట్లపై కోతులు ఉండడం తోపాటు అడవి పందులు వస్తున్నాయని పక్కనుంచే రైతులు తమ వ్యవసాయ భూముల వద్దకు వెళుతుంటారని వాటి వల్ల ఇబ్బందులు కలుగుతుండడంతో ఆందోళన గురవుతున్నారని పేర్కొన్నారు. గ్రామస్తుల భద్రత దృష్ట్యా అట్టి భూమిలో చెట్ల పొదలను తొలగించాలని గ్రామ పంచాయతీకి అనుమతి ఇవ్వాలని కోరారు. రైతులు పండించిన ధాన్యం అరపోసుకునే అవకాశం ఉంటుందని అందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఆమె వెంట వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

## ప్రసాదం కౌంటర్‌లో ఆన్‌లైన్ చెల్లింపులు ఎప్పుడు..?



**ప్రజాపక్షం/కొమురవెల్లి :** శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానానికి వచ్చే భక్తులకు ప్రసాదం కొనుగోలు విషయంలో నగదు చెల్లింపులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రసాదం కౌంటర్ల వద్ద యూపీఐ, గూగుల్‌పే, ఫోన్‌పే, క్యూఆర్ కోడ్ వంటి ఆన్‌లైన్ చెల్లింపు సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం డిజిటల్ చెల్లింపులు విస్తృతంగా వినియోగంలో ఉన్న నేపథ్యంలో దేవస్థానం ప్రసాదం కౌంటర్ల వద్ద కూడా ఆన్‌లైన్ పేమెంట్ సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు నగదు అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారని చెబుతున్నారు. భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రసాదం కౌంటర్ల వద్ద క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించే అవకాశం కల్పించడంతో పాటు, నగదుఆన్‌లైన్ రెండు విధానాలను అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. దేవస్థాన అధికారులు ఈ అంశంపై వెంటనే దృష్టి సారించి డిజిటల్ చెల్లింపుల సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్..



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** బతుకమ్మ పండుగ నేపథ్యంలో సిద్దిపేట పట్టణంలో చేపట్టాల్సిన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ శనివారం పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని పలు చెరువులు, ప్రధాన ప్రాంతాలు, కాలనీల్లో పర్యటిస్తూ పారిశుధ్యం, మౌలిక వసతులు, నీటి సరఫరా, డ్రైనేజీ తదితర సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లింగారెడ్డిపల్లిలోని చింతల్ చెరువు, తిమ్మలకుంట చెరువులను, పట్టణంలోని ఎర్ర చెరువులను కమిషనర్ మల్లికార్జున్ క్షుణ్ణంగా పరిశీలించారు. చింతల్ చెరువు వద్ద ఉన్న ఎస్‌టిపిని కూడా పరిశీలించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. బతుకమ్మ పండుగను దృష్టిలో ఉంచుకుని చెరువుల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తాచెదారం పేరుకుపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పండుగకు సంబంధించి చేపట్టాల్సిన అన్ని పనులను ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని కోమటి చెరువు, రూబీ నెక్లెస్ రోడ్డుపై ఏఈ పృథ్వీతో కలిసి కమిషనర్ పరిశీలించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున మౌలిక వసతుల ఏర్పాట్లు, ఇతర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీగురుపీఠంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి సతీమణి పూజలు



**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల శివారులోని చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి సతీమణి ఆర్.రజితరెడ్డి కుటుంబసభ్యులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ చేతులమీదుగా పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేసి ఈఓ సార శ్రీనివాస్‌తో కలసి ఘనంగా సన్మానించారు. అనంతరం గూడురులోని శ్రీగురుపీఠంలో దత్తాత్రెయమహాస్వామి, సాయిబాబా మందిరాల్లో పూజలు చేయగా శాస్త్రుల నటరాజశర్మ అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఇక్కడి ఆద్యాత్మికతపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

## ఘనంగా పోషణ మాసం వేడుకలు



**ప్రజాపక్షం/కొమురవెల్లి :** శనివారం రోజున జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ఈరోజు చేర్యాల ప్రాజెక్టు పరిధిలోని కొమురవెల్లి మండల స్థాయి పోషణ మాసం వేడుకలు తపస్పల్లి గ్రామ సర్పంచ్ పుట్టా కనకరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో సూపర్వైజర్ చంద్రకళ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సంపూర్ణమైన పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు అలవాటు చేసుకోవాలని గర్భిణీ బాలింతలు తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే సేవలను వినియోగించుకోవాలని కోరడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గర్భిణీ బాలింతలు ఆరు సంవత్సరాల లోపు పిల్లలు తీసుకోవలసిన ఆహారం గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బ్లాక్ కోఆర్డినేటర్ కనకరాజు మాట్లాడుతూ 9వ జాతీయ పోషణ మాసం యొక్క ఉద్దేశాలను గ్రామస్తులకు అవగాహన కల్పించడం జరిగింది. ప్రతి ఒక్కరు నిత్యం తీసుకునే ఆహారంలో ఆహార వైవిధ్యతను పాటిస్తూ సమతుల్యమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు శ్రీమంతాలు పిల్లలకు అన్నప్రాసన అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ములుగు నర్సింలు, వార్డ్ మెంబర్స్, ఆశ వర్కర్లు అంగన్వాడి టీచర్ ల ఆధ్వర్యంలో జరిగింది.

## మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సేవా సంపర్క్ అభియాన్ లో భాగంగా ఈనెల 6న బూరుగుపల్లి నుంచి రామయంపేట వరకు నిర్వహించనున్న మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. మెదక్ ఎంపి రఘునందన్‌రావు సూచన మేరకు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పార్టీ నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఈ నెల 6న పెద్ద ఎత్తున చేపడుతున్నామని, ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వస్తున్నారని, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. చెట్లు నాటడం తోపాటు సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు,ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

**అమిత్ షా ప్రోగ్రాంకు అందరూ హాజరు కావాలి..**

ఈనెల 4న తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లి శివారులో నూతనంగా నిర్వహించిన అమూల్ పాల పరిశ్రమ శంకుస్థాపన చేయడానికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వస్తున్నందున కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఎంపి రఘునందన్‌రావు అధ్యక్షతన జరిగే సమావేశంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్ కుమార్ తోపాటు ఇతర నేతలు పాల్గొంటారని తెలిపారు. బిజెపి రాష్ట్ర,జిల్లా నాయకులు,కార్యకర్తలు,శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని తెలిపారు. ఎంపి పిఆర్ఓ వంశీ, రామాయంపేట కౌన్సిలర్ శంకర్,పుల్లూరు రాజు,శ్రీనివాస్ గౌడ్,అమర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** ఓటు హక్కు పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం రాజకీయ పార్టీలు, ప్రజలు ఐక్యంగా కృషి చేయాలని కాంగ్రెస్, సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఏఐసీసీ, పీసీసీ, డీసీసీ పిలుపు మేరకు ఓటు చోరీకి వ్యతిరేకంగా బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇండియా కూటమి పార్టీల ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అద్యక్షుడు మహ్మద్ మసూద్, సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ఓటు స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా నమోదై, ఓటర్లు తమ హక్కును వినియోగించుకునేలా ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు శ్రీనివాస్, మల్లయ్య, ఎల్లయ్య, రాములు, అశోక్, పాల్గొన్నారు.

## టిజి రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవీందర్

**ప్రజాపక్షం/కమలాపూర్:** తెలంగాణ రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర స్థాయి సమావేశం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని కమలాపూర్ మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన తాటికంటి ఉపాధ్యక్షుడిగా రవీందర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య ఆధ్వర్యంలో రవీందర్ ఎన్నికైన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ... తన పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాన ని, ఆరోగ్య మిత్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నా రు.

## కుంకుమేశ్వర దేవస్థాన చైర్మన్‌కు సన్మానం

**ప్రజాపక్షం/పరకాల:** హనుమకొండ జిల్లా పరకాల లోని శ్రీ కుంకుమేశ్వర దేవస్థానం చైర్మన్ గా నాలుగవ సారి ఎన్నిక అయి ప్రమాణ స్వీకారం చేసిన పరకాల కి చెందిన కొలుగూరి రాజేశ్వర్ రావును ఓసి సంఘాల రాష్ట్ర కన్వీనర్ గోపు జై పాల్ రెడ్డి,రాష్ట్ర అధికార ప్రతినిధి కామిడి సతీష్ రెడ్డి,రాష్ట్ర కో ఆర్డినేటర్ మాడుగుల పాపి రెడ్డి,బూచి ప్రభాకర్ రెడ్డి తదితరులు దేవస్థాన ఆవరణ లో సన్మానించారు.జై పాల్ రెడ్డి మాట్లాడుతూ రాజేశ్వర్ రావు ఓసి సంఘాలలో చురుకైన వ్యక్తి అని గుడి చైర్మన్ గా నాలుగవ సారి నియామకం కావడం అభినంద నీయం అన్నారు. వారి హయాం లో వారు పాలక మండలి కుంకుమయ్య గుడిని మరింత అభివృద్ధి చేయాలని అన్నారు.వారికి అన్ని వేళలా తమ ఓసి సంఘాల సహకారం ఉంటుందని అన్నారు. వారితో చిట్టి రెడ్డి వెంకట్ రెడ్డి,ఎర్రబెల్లి భాస్కర్ రెడ్డి, కొలుగురి వేణు రావు పాల్గొన్నారు.

## పిఆర్‌సి ఫిట్‌మెంట్ ప్రకటించి వెంటనే అమలుపరచాలి

**ప్రజాపక్షం/కమలాపూర్:** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కమలాపూర్ మండల శాఖ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల కమలాపూర్ నందు మండల శాఖ అధ్యక్షులు ఉజ్జేతుల రాజు అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా హాజరైనా టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, జిల్లా అధ్యక్షులు బత్తిని శ్రీరామంజనేయులు మాట్లాడుతూ... ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు పిఆర్‌సి రిపోర్టును తెప్పించుకోని ఫిట్‌మెంట్ ను వెంటనే ప్రకటించి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలనే ప్రభుత్వ ఉత్తర్వు 25 ను వెంటనే సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలకు తరగతికి ఒక ఉపాధ్యాయుని కేటాయించి, ప్రతి తరగతికి ఒక గదిని నిర్మించి, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించి ప్రతి ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచాలని కోరారు. ఈ సమావేశం లోఓ రాష్ట్ర కౌన్సిలర్ ముత్యాల రఘుపతి, మండల ప్రధాన కార్యదర్శి లకుం భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రగిరి లక్ష్మ య్య, జిల్లా కార్యదర్శి గొడిశాల రమేష్, శ్రీరాములు, మోహన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఘనంగా ఆరుద్రాష్టమి వ్రతం

**ప్రజాపక్షం/సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాది లోని శ్రీజ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆద్వర్యంలో ఫీఠాధిపతి మహేశ్వర శర్మ సిద్దాంత పర్యవేక్షణలో ఆరుద్రాష్టమి వ్రత క్రతువు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఆరుద్రాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు ,అభిషేకాలు, నిర్వహించిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.2700 మంది మహిళలతో సామూహిక ఆరుద్రాష్టమి వ్రతాన్ని నిర్వహించారు. నిర్మలా జగ్గారెడ్డి సైతం ఈ వ్రతంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆరుద్రా ష్టమి మహాత్యం ,అమ్మవారి విశిష్టత పూజా విదానాలను నిర్వహకులు ,భక్తులకు వివరించారు భక్తి శ్రద్దలతో నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఫసల్ వాది జ్యోతిర్వాస్తు విద్యాఫీఠం ఆద్మాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, తోపాజీ అనంత్ కిషన్ ఎస్సీ సెల్ అద్యక్షుడు గంగేరి శ్రీహరి,జ్యోతిర్వాస్తు విద్యాపీఠం నిర్వాహకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రత సౌకర్యాలకు ప్రాధాన్యత

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి పరిశుభ్రమైన వాతావరణం , పౌష్టికాహారం, సురక్షితమైన తాగునీరు. అవసరమైన మౌళిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ సమావేశంమందిరంలో ఎస్సీ ,ఎస్టీ బిసి మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలో మౌళిక సదుపాయాలు, మరమ్మతులు అవసరాలు విద్యార్థులు భద్రత తదితర అంశాలపై సంబందిత అధికారులు జిల్లా కోఆర్గినేటర్లు ,ప్రిన్సిపాళ్లతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ,ఆరోగ్యకరమైన పరిశుభ్రమైన ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆహారం తయారీ నిల్వ పంపిణిలో



పరిశుభ్రత ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన సురక్షితమైన త్రాగునీరు. నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. అలాగే వసతి గృహాల్లో తగిన గాలి వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా ప్రతి గదిలో అవసరమైన ప్యాన్లు ,లైట్లు, ఏర్పాటు చేయాలని సూచించారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు తాగునీటి సదుపాయాలు సక్రమంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్, ఎస్సీ ,ఎస్టీ,బిస్సీ, మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల జిల్లా కో ఆర్డినేటర్లు ప్రిన్సిపాళ్లు సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణలో ఘనంగా స్టూడెంట్ - లెడ్ కాన్ఫరెన్స్

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** హన్మకొండ జిల్లాలో ఉన్న నక్కలగుట్టలో నారాయణ స్కూల్ లో ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ఎం రాజశేఖర్ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఆర్ఎన్ డి స్వాతి లక్ష్మి , ముఖ్య అతిధిగా నారాయణ విద్యా సంస్థల (స్కూల్ విభాగం) డిప్యూటీ జనరల్ మేనేజర్ సిరాజుల రిజ్వానా ఇమ్రాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిజిఎం మాట్లాడుతూ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ అనే,ఈ కార్యక్రమం విద్యార్థుల నేతృత్వంలో జరిగే సమావేశంగా పిలుస్తారన్నారు. అదేవిధంగా విద్యార్థులు తాము నేర్చుకున్న విషయాలను తమ తల్లిదండ్రులకు స్వయంగా వివరించడం జరుగుతుందన్నారు. విద్యార్థులలో కమ్యూనికేషన్, ప్రజెంటేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు తమ అభ్యాసం పై పూర్తి ఆత్మవిశ్వాసాన్ని బాధ్యతను కల్పిస్తుంది అన్నారు.అనంతరం ప్రిన్సిపాల్ ఎం రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల తమ అభ్యాసాన్ని ప్రదర్శించే తీరును పూర్తిగా తల్లిదండ్రులు గమనించవచ్చు అన్నారు. రానున్న రోజుల్లో కొత్త కొత్త నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశం ఎంతగానో పెరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎన్ డి స్వాతి లక్ష్మి , ప్రిన్సిపాల్ ఎం రాజశేఖర్, ఈ చామ్స్ కోఆర్డినేటర్ శ్యామల, శిరీష,హై స్కూల్ కోఆర్డినేటర్ సాయి కృష్ణ, వైస్ ప్రిన్సిపల్ కరుణశ్రీ, ఉపాధ్యాయులు జ్యోతి, గౌతమి, సరిత, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ ఎన్నికల్లో దళిత బహుజన పార్టీలు నిజాయితీని చూపించాలి

**ప్రజాపక్షం/మంగపేట:** తెలంగాణ రాష్టంలో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్రంలోని అధికార ప్రతి పక్ష పార్టీ అధినేతలు ఈ మధ్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ల ఐక్య కార్యాచరణ జాక్ గా వెలిసిన పార్టీలు దళిత బహుజన ప్రజా సంఘాలు పేదలపెన్నిధి అని చెప్పుకొనే వివిధ సంఘాలు దేశంలో 90 జనాభా కలిగిన ఉన్నాం అధికారం మాదే మా ఓట్లు తోనే రాజకీయ పార్టీలు అధికారం లోనికి వస్తున్నాయి అని చెప్పుకునే మేధావులు బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులను గెలిపించు కుంటారా అధికార ప్రతి పక్ష పార్టీ లకు దాసోహం గా మారుతారా ఎమ్మెల్సీ



ఎన్నికల్లో ఓటు వేస్తున్న అభ్యర్థులు అందరూ విద్యావంతులు అందరూ శాఖా హారులే, కోడి పిల్ల ఎలామాయమైంది అనే సామెత గా మారుతారా లేదా చూడాలి. ఈ ఎన్నికల్లో దళిత బహుజన సంఘాల నాయకులు ఓటమి చెందినట్లుగా జరుగుతే ప్రజా సంఘాల పేరుతో ఉద్యమానికి ద్రోహం చేస్తున్నారని, భావించి ప్రజా క్షేత్రంలో అభాసుపాలు చేయడం తప్పదని నిలదీయడం లో వెనుకాడ బోమని లంబాడా న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు దేవా నాయక్ మీడియా ప్రకటనలో తెలిపారు.

## బిఆర్‌ఎస్‌ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు పరామర్శ

**ప్రజాపక్షం/మంగపేట:** ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మ ణ్ బాబు ఆదేశాల మేరకు మండలంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఇరువై వేల రూపాయల ఆర్థిక సాయం అందజేసిన బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు మండలంలో అక్కినేపల్లి మల్లారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన జక్కా రాజేందర్‌కు ఐదు వేలు దొడ్డా చిన నర్సయ్య ఐదు వేలు కొత్త మల్లూరు గ్రామంలో ఇటీవల మరణించిన బట్ట నిర్మల కుటుంబ సభ్యులకు ఐదు వేలు తిమ్మంపేట గ్రామంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మోదుగు బాబు భార్య మోదుగు శ్రీలత మృతి చెందాగా వారి కుటుంబ సభ్యులకు ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.

అలాగే కమలాపురం గ్రామంలో మండల నాయకులు కోడెం సత్యనారాయణ, అన్న కొడెం సమ్మయ్య, దశదిన కర్మలలో పాల్గొని వారి కుటుంబాన్ని ఓదార్చి పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తాటి కృష్ణ, కుర్బన్ అలీ, పప్పు వెంకటరెడ్డి, చిట్టిమల్ల సమ్మయ్య, కాడబోయిన నరేందర్, సిద్ధంశెట్టి, లక్ష్మ ణ్ రావు, యాలవర్తి శ్రీనివాస్, నాగేశ్వరావు, ఫిరోజ్, రూప భద్రయ్య, మునిగేలా సాంబుల్, నర్సింహులు, దంతన పల్లి నరేందర్, సాంబాశివారావు, సోషల్ మీడియా వారియర్ మునిగేలా నరేష్ పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంఘాల మండల సదస్సు విజయవంతం

**ప్రజాపక్షం/కొండాపూర్:** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ అనుబంద సంఘాల మండల సదస్సును నిర్వహించారు. మండల ఎంఆర్‌పిఈఎస్ కమిటీ ఆద్వర్యంలో జరిగిన ఈ సదస్సును ఎర్రోళ్ల సిమోన్ అద్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్ పిఎస్ జిల్లా ఇన్‌చార్జీ రామారావు శ్రీనివాస్ మాదిగ జిల్లా మాజీ అద్యక్షులు మైపగల్ల బుచేంద్ర మాదిగ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గ్రామ స్థాయిని నుంచి ఎంఆర్‌పిఎస్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రతి గ్రామములో అనుబంధ సంఘాల కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. అక్టోబరర్ 6న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటిలో నిర్వహించనున్న ఎంఎస్ఎఫ్ జాతీయ విద్యార్థి సదస్సును విద్యార్థులు యువత పెద్ద సంఖ్యలో హాజరయూలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు జార్జీ, ఉపాధ్యక్షులు, రమేష్, కార్యదర్శులు, రాజు,ఎల్ సతీష్, సామ్రాట్ , కార్యకర్తలు ఎంఎస్ ఎఫ్ ప్రతినిదులు పాల్గొన్నారు .

## గ్రామ పాలనాధికారుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

### జిపిఒలో ప్రథమ మహాసభలో నిర్మలా జగ్గారెడ్డి



**ప్రజాపక్షం/సంగారెడ్డి:** ప్రభుత్వానికి ప్రజలకు మద్య అనుసందాన కర్తలు గ్రామ పాలనాధికారులేనని డిసీసీ మాజీ అద్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారిదే కీలక పాత్ర అని ఆమె వివరించారు. గ్రామ పాలన ఆపీసర్స్ అసోసియేషన్ తెలంగాణ సంగారెడ్డి జిల్లాకమిటీ ఆద్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన ప్రథమ మహాసభలకు డిసిసి మాజీ అద్యక్షురాలు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించి వీఆర్వో వ్యవస్థను నాశనం చేసిందన్నారు. వాళ్లు చేసే భూ అక్రమాలు వెలుగులోకి రావద్దని ఉద్దేశంతోనే వీఆర్వో వ్యవస్థను తొలగించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే తిరిగి వారి సేవలను వినియోగించుకునేలా గ్రామ పాలనాధికారులుగా నియమించారని ఆమె గుర్తు చేశారు. రానున్న రోజుల్లోనూ వారిని మరింత ప్రోత్సహించేలా ప్రభుత్వం పని చేస్తుందన్నిరు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు, కొన్నిడిమాండ్లను నిర్మలా జగ్గారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. తప్పకుండా ఈ డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాతానని ఆమె హామీ ఇచ్చారు. వాటి పరిష్కారం కోసం తన వంతుగా కృషి తనవంతుగా కృషి చేస్తానన్నారు.